సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం। 23। ఆగస్టు। 2025



సరిపడా వైద్యులు లేక...

జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో సరిపడా వైద్యులు, సిబ్బంది లేక గర్భిణులకు ఆశించిన స్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. 8లో



ఫీవర్ సర్వే నిర్వహించాలి

సీజనల్ వ్యాధుల వ్యాప్తి కట్టడికి గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచ ధారణలో రామయ్య

లక్ష్మీ అమ్మ వారికి పుష్పాంజలి



పుష్పాంజలి సేవలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపారు. అలాగే, సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో కొలువైన లక్ష్మీతాయారు అమ్మవారికి శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పుష్పాంజలి పూజ నిర్వహించారు. బేడా మండపంలో స్వామివారు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చిన అర్చకులు పూజలు చేశారు. ఈఓ రమాదేవి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతంతో అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలో కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం చేశాక, కుంకుమ పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జెన్‌కోలో ఉద్యోగ నియామక పత్రాలు

పాల్వంచ: జెన్‌కోలో పెండింగ్ ఉన్న భూనిర్వాసిత, కారుణ్య నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాలు అందించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భూ నిర్వాసితులు 335మంది, కారుణ్య కేటగిరీలో 130 మందికి నియామకపత్రాలు అందజేశారు. బీటీపీఎస్, కేటీపీఎస్‌లో చెందిన పలువురు ఉద్యోగాలు పొందగా, ఇప్పటికే పోస్టింగ్ కూడా కేటాయించడంతో త్వరలోనే విధుల్లో చేరనున్నారు. కాగా, కారుణ్య నియామకాల్లో ఆలస్యంతో ఇటీవల 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం, యాజమాన్యం నియామకాలను వేగం చేసిందని పలు యూనియన్ల నాయకులు తెలిపారు.

ఈఎంటీ, కెప్టెన్ ఉద్యోగాలకు దరఖాస్తులు

కొత్తగూడెంఅర్బన్: ఈఎంఆర్‌ఐ 108 వాహనంలో ఎమర్జెన్సీ టెక్నీషియన్(ఈఎంటీ), 102 అమ్మ ఒడి వాహనంలో కెప్టెన్(డ్రైవర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన పురుష అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈఎంటీ పోస్టుకు బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీ ఫార్మసీ పూర్తిచేసిన వారు, డ్రైవర్ పోస్టుకు 10 తరగతి పాసై, 22 – 35 ఏళ్ల వయస్సు, కనీసం మూడేళ్ల అనుభవం, ఎల్ఎంవీ బ్యాడ్జ్ కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఇతర వివరాలకు 90102 51025, 91549 18117, 9989458588 నంబర్లలో సంప్రదించాలని శివకుమార్ సూచించారు.

18 మందికి పదోన్నతి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు(స్కూల్ అసిస్టెంట్లు) 18మందికి గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు శుక్రవారం 16 మంది విధుల్లో చేరగా, మరో ఇద్దరు చేరాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. పదోన్నతి పొందిన వారిలో జిల్లా నుంచి ఇద్దరు ఇతర జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాల నుంచి నలుగురు జిల్లాకు వచ్చారని తెలిపారు. మరోపక్క ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది.

ఆదర్శంగా.. అద్భుతంగా..

జిల్లా కేంద్రంలో నిర్మించనున్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ భవనాల మాస్టర్ ప్లాన్ రెడీ అయింది. ప్రముఖ ఆర్కిటెక్ట్ ఉష రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను మంత్రి తుమ్మలతో పాటు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ యోగితారాణా శుక్రవారం హైదరాబాద్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాన్‌ను సమగ్రంగా పరిశీలించిన వారు నిర్మాణ వివరాలు, ఇతర అంశాలపై సమీక్షించారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్ నమూనా

తెలంగాణ ఖ్యాతిని పెంచేలా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

- అత్యాధునిక సౌకర్యాలతో 300 ఎకరాల్లో నిర్మాణం
- త్వరలోనే సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ప్లాన్‌ను పరిశీలించి సమీక్షించిన మంత్రి తుమ్మల

పరిశీలించిన మంత్రి తుమ్మల

మాస్టర్ ప్లాన్ పరిశీలన సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో, అన్ని మౌలిక సదుపాయాలతో భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా అద్భుతంగా ప్లాన్ రూపొందించాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులకు అసౌకర్యం ఎదురుకాకుండా విశాలమైన తరగతి గదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలు నిర్మించాలని సూచించారు. డిజైన్లను సీఎం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించాక ఆమోదం తీసుకోవాలని తెలిపారు. కాగా, సీఎం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చాక ప్రారంభ వేడుక నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

మూడేళ్లలో భవనాలు పూర్తి

డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించడానికి ముందే కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌తో మంత్రి తుమ్మల మాట్లాడారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాల్లో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలని, హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రానున్న మూడేళ్లలో యూనివర్సిటీ భవనాల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. కాగా, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దేశంలోనే మొదటిదని.. ఇది తెలంగాణకే కాక దేశానికే తలమానికంగా నిలిచేలా ఆకర్షణీయమైన డిజైన్లతో నిర్మించాలని సూచించారు. 300 ఎకరాల్లో ఏర్పాటయ్యే యూనివర్సిటీ అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారనుందని మంత్రి పేర్కొన్నారు. యూనివర్సిటీ ద్వారా వేలాది మంది యువ శాస్త్రవేత్తల భవిష్యత్‌కు బాటలు వేసే అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



మాస్టర్ ప్లాన్‌పై చర్చిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన వీసీ యోగితారాణా, ఆర్కిటెక్ట్ ఉష

డిజైన్ ఇలా..

కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌కు సంబంధించిన 380 ఎకరాల స్థలాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్లాన్‌ను రూపొందించారు. సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల భవనం, మెడికల్ కాలేజీలను కలుపుతూనే భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా డిజైన్ చేశారు. భద్రాచలం – కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి యూనివర్సిటీ క్యాంపస్‌లోకి వెళ్లగానే తొలుత వచ్చే క్వార్టర్లు, ఉమెన్స్ హాస్టల్, అడ్మినిస్ట్రేషన్ భవనాలను అలాగే కొనసాగించాలని నిర్ణయించారు. అలాగే, ప్రస్తుతం శిథిలమైన ఆడిటోరియం, ఆ పరిసరాలను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేసేలా ప్లాన్‌లో పొందుపరిచారు. ప్రస్తుతం ఉన్న కొత్త బాయ్స్ హాస్టల్ అలాగే కొనసాగనుంది. అయితే 1980వ దశకంలో నిర్మించిన పాత హాస్టల్ వద్దే యూనివర్సిటీ నూతన నిర్మాణాలు చేపడుతారు. ఇక్కడ నాలుగు అకడమిక్ బ్లాక్‌లు, సెంట్రల్ ఫెసిలిటీ సెంటర్, క్యాంటిన్, లైబ్రరీ భవన నిర్మాణాలను ప్లాన్‌లో పొందుపరిచారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు పక్కన బాయ్స్ హాస్టళ్లు, డైనింగ్ హాల్, అకడమిక్ భవనాలకు సమీపాన గర్ల్స్ హాస్టల్, డైనింగ్ హాల్ నిర్మిస్తారు. గర్ల్స్ హాస్టల్ భవనాల పక్కన మెడికల్ కాలేజీ ప్రాంగణం ఉంది. ఇక బాయ్స్ హాస్టల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రస్తుతం పార్కింగ్ కోసం కేటాయించి.. భవిష్యత్‌లో అవసరమైన భవనాల నిర్మాణాలకు ఉపయోగించనున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి





పినపాక : అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం, కలెక్టర్ పాటిల్ (ఇన్‌సెట్) మణుగూరులోని : పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం
- 'పనుల జాతర'లో కలెక్టర్ జితేష్ పాటిల్, ఎమ్మెల్యే పాయం

పినపాక: ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో నష్టాలు ఎదురవుతున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని.. ఇందులో మునగ సాగుతో లాభాలు ఉంటాయని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండలంలోని సీతారాంపురంలో రూ.12 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ కేంద్రం భవనానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 'పనుల జాతర'లో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, మహిళా సంఘాల సభ్యులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తూ కోళ్ల ఫారాలు, చేపలు, గేదెల పెంపకం చేపట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తూనే పౌష్టికాహారం అందిస్తున్నందున చిన్నారులను చేర్పించాలని సూచించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఏడీఏ తాతారావు, పినపాక, మణుగూరు తహసీల్దార్లు గోపాలకృష్ణ, అద్దంకి నరేష్, ఎంపీడీఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ వినీత తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్ కోసం నాణ్యమైన విద్య

మణుగూరు రూరల్: విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరేలా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. మణుగూరులోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల, బీసీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, వసతిగృహాలను తనిఖీ చేసిన కలెక్టర్ తరగతి గదులు, భోజనశాల, సామగ్రిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు బోధించడమే కాక వారి ఆరోగ్యంపైనా ఉపాధ్యాయులు శ్రద్ధ కనబర్చాలన్నారు. వంట విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎంఈఓ స్వర్ణజ్యోతి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొత్తపంథా

- 'కాపాస్ కిసాన్' పేరిట ప్రత్యేక యాప్
- యాప్‌లో రిజిస్ట్రేషన్‌తో సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఈసారి నూతన విధానం అమలుచేయనుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందించేలా సీసీఐ 'కాపాస్ కిసాన్' యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే సీసీఐ కేంద్రాల్లో పంట విక్రయించే అవకాశం ఏర్పడుతుంది. ఈనెల 30 నుంచి గుగూల్ ప్లే స్టోర్, యాపిల్ ఐఓఎస్ స్టోర్‌లో యాప్ అందుబాటులోకి రానుంది. ఈమేరకు రైతులు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని భూమి పత్రాలు, పత్తి సాగు చేసినట్లు రెవెన్యూ శాఖ ధ్రువీకరణ, ఆధార్ కార్డులతో సెప్టెంబర్ 1నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పారదర్శకత, మద్దతు ధర

కేంద్ర ప్రభుత్వం పత్తికి నిర్ణయించిన మద్దతు ధర రైతులకు దక్కేలా సీసీఐ నూతన విధానం అమలుకు చర్యలు చేపట్టింది. గతంలో అనుసరించిన విధానంలో కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర ఎక్కువగా దళారులే దక్కించుకున్నారనే విమర్శలు వచ్చాయి. రైతుల నుంచి దళారులు కొనుగోలు చేసి బినామీల పేరిట పత్రాలతో సీసీఐ కేంద్రాల్లో అమ్ముతూ మద్దతు ధర పొందారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యాన నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ఫలితంగా క్వింటా పత్తికి నాణ్యత ఆధారంగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర గరిష్టంగా రూ. 8,110 అసలైన రైతులకే దక్కేలా 'కాపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

గిరిజన ఉత్పత్తులకు మరింత మార్కెటింగ్




సబ్బులు ఆవిష్కరించిన పీఓ రాహుల్, పక్కన అధికారులు, మహిళా గ్రూప్ సభ్యులు

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ఆదివాసీ మహిళలు తయారు చేసే ఉత్పత్తుల మార్కెటింగ్‌ను మరింత మెరుగుపర్చుకోవాలని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలోశుక్రవారం ఆయన మహిళలు తయారుచేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపూల లడ్డూలు, సబ్బులు షాంపూలను ఐటీసీ అధికారుల సమక్షాన పరిశీలించి మాట్లాడారు. మహిళలకు ఐటీసీ సహకరిస్తే చిన్న తరహా పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారని తెలిపారు. ఈమేరకు మార్కెటింగ్, స్టాళ్ల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అనంతరం దమ్మక్క జాయింట్ లయబిలిటీ గిరిజన మహిళా గ్రూప్ సభ్యులు తయారు చేసిన మోవా సోప్, బ్యాంబో సోప్‌లను పీఓ ఆవిష్కరించారు. అనంతరం ఉద్దీపకం వర్క్ బుక్–2 ద్వారాబోధనపై అధికారులతో సమీక్షించిన పీఓ పలు సూచనలు చేశారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో డివిజన్ల వారీగా ఉద్దీపకం వర్క్ బుక్‌పై టీఎల్ఎం మేళా నిర్వహిస్తామని తెలిపారు. అలాగే, రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన కిన్నెరసానిలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు రిషివర్మ, వెంకన్నబాబును పీఓ అభినందించారు. ఈకార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఐటీసీ మేనేజర్ చంగల్‌రావు, జేడీఎం హరికృష్ణ, వివిధ విభాగాల ఉద్యోగులు రమేష్, బాలసుబ్రహ్మణ్యం, చందు, వెంకటేశ్వర్లు, అంజయ్య, వాసు పాల్గొన్నారు.

కూనంనేని.. మరోసారి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి ఎన్నిక
- రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నేతలకు స్థానం



కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా రెండో సారి ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గాజుల రామవరంలో పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతుండగా శుక్రవారం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈమేరకు కూనంనేని మరోమారు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన ఐదు దశాబ్దాలుగా సీపీఐలో కీలపాత్ర పోషిస్తున్నారు. 2005 నుండి 2009 వరకు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటి రాష్ట్ర మంత్రి వనమా వెంకటేశ్వరరావుపై విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆతర్వాత 2023లో ఎన్నికల్లో బరిలోకి దిగిన కూనంనేని గెలిచారు. రాష్ట్ర కార్యదర్శిగా గత మూడేళ్లలో రంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మేడ్చల్, మహబూబాబాద్ తదితర జిల్లాలో భూపోరాటాల ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూముల పంపిణీలో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో వామపక్షాల నుంచి ఏకైక ఎమ్మెల్యేగా కొనసాగుతున్న కూనంనేని 2023లో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా విజయానికి కృషి చేశారు.

రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా మౌలానా

ఖమ్మం మయూరిసెంటర్: సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా మహమ్మద్ మౌలానా రెండోసారి ఎన్నికయ్యారు. సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మౌలానా ఎన్నికపై పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర కమిటీలో 13 మందికి చోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు ఎన్నికవడమే కాక రాష్ట్ర కార్యవర్గంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేతలు పలువురికి స్థానం దక్కింది. జిల్లా నుంచి ముగ్గురు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, పది మంది రాష్ట్ర సమితిలో చోటు దక్కించుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా, నాయకులు ముత్యాలు విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే, రాష్ట్ర సమితి సభ్యులుగా కె.సారయ్య, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, వై.ఉదయ్‌భాస్కర్, ఎస్‌డీ.సలీం, రావులపల్లి రవికుమార్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్ ఎన్నిక కాగా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నుంచి మిర్యాల రంగయ్య రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

అమ్మకు ఆపద ఎదురుకావొద్దని..

- ముంపు ప్రాంతాల్లో వైద్యసిబ్బంది అప్రమత్తత
- ఏరియా ఆస్పత్రులకు గర్భిణుల తరలింపు
- ప్రసవం సమయాన ఇక్కట్లు రాకుండా జాగ్రత్తలు

కరకగూడెం: కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరికి వస్తున్న వరదతో ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. పలు చోట్ల వరదలు, వాగులు పొంగి పొర్లగా ఈ అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యాన ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా ఏరియా ఆస్పత్రులకు తరలించారు.

గ్రామగ్రామాన ఆరా

భారీ వర్షాలు, వరదల నేపథ్యాన ఏజెన్సీలోని పలు గ్రామాలకు ఏటా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈనేపథ్యాన గర్భిణుల వివరాలను ఇప్పటికే నమోదు చేసిన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు అందులో ప్రసవానికి సమీపాన ఉన్న వారిని గుర్తించారు. ఒకవేళ గ్రామాలను వరద ముంచెత్తినా, రాకపోకలు నిలిచిపోయినా ఇబ్బంది ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్తగా గర్భిణులను సమీపంలోని ఏరియా ఆస్పత్రులకు తరలించారు. జిల్లాలోని 23 మండలాల్లో 29 పీహెచ్‌సీల పరిధిలో 19 మంది గర్భిణులను భద్రాచలం, మణుగూరు ఏరియా ఆస్పత్రులతో పాటు చర్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు.



పినపాక నుంచి మణుగూరు ఆస్పత్రికి తీసుకెళ్తున్న గర్భిణులతో ఉద్యోగులు

శాశ్వత పరిష్కారం లేదా?

వైద్య, ఆరోగ్యశాఖలోని వైద్యులు, ఉద్యోగులు ఏజెన్సీ గ్రామాలపై దృష్టి సారిస్తున్నా చాలాచోట్లకు సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడం ఇబ్బందిగా నిలుస్తోంది. మట్టి రోడ్లు, బురదమయమైన దారులు, వాగులపై వంతెనలు లేకపోవడం వల్ల వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ కారణంగానే గర్భిణులు, అత్యవసర వైద్యం అవసరమైన వారు ఆస్పత్రులకు సకాలంలో చేరుకోలేక ప్రాణాపాయం ఎదుర్కొంటున్నారు. వలస ఆదివాసీ గ్రామాల నుంచి ఆపదలో ఉన్నవారు, గర్భిణులను డోలీల్లో మోసుకొచ్చే ఘటనలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ఏటా వర్షాకాలంలో గర్భిణులను ముందు జాగ్రత్తగా చర్యగా ఆస్పత్రులకు తీసుకొస్తున్నా శాశ్వత పరిష్కారంపై మాత్రం దృష్టి సారించడం లేదు. ఇకనైనా ఆదివాసీ, మారుమూల గ్రామాలకు రవాణా సాఫీగా జరిగేలా రహదారులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక వైద్య ప్రణాళిక



వరదలతో ముప్పు ఎదురు కాకుండాప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. అత్యవసర పరిస్థితి ఉన్న గర్భిణులను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాం. మిగతా గర్భిణులను సైతం ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు నిత్యం పరిశీలిస్తున్నారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రత్యేక వైద్య బృందాలు, అంబులెన్స్ సిబ్బంది సిద్ధంగా ఉంటారు.

– డాక్టర్ జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

నిలకడగా గోదావరి



భద్రాచలంలో బ్రిడ్జిల సమీపాన గోదావరి ప్రవాహం

ప్రమాద హెచ్చరికలన్నీ ఉపసంహరణ

భద్రాచలంటౌన్: భద్రాచలంలో గోదావరి వరద ప్రవాహం శుక్రవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో గురువారం సాయంత్రం వరకు పెరిగినా.. ఆతర్వాత తగ్గుతూ వచ్చింది. ఈ క్రమాన శుక్రవారం ఉదయం 10గంటలకు వరద 47.50 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అలాగే రాత్రి 9–30 గంటలకు 42.50 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరిస్తూ ప్రకటన విడుదల చేశారు. కాగా, గోదావరికి బుధవారం రెండు ప్రమాద హెచ్చరికలు జారీ చేయగా, ఉపసంహరణ సైతం ఒకేరోజు జరగడం గమనార్హం. ఇక పలుచోట్ల రహదారులపైకి చేరిన గోదావరి వరద తొలగిపోవడంతో రాకపోకలు మొదలయ్యాయి. అయితే, మళ్లీ వరద పెరిగే అవకాశముందని సూచనతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

క్లుప్తంగా

కిన్నెరసాని నుంచి నీటి విడుదల



గేటు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరద

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలతో మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. కిన్నెరసాని రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, ఎగువ నుంచి 600 క్యూసెక్కుల వరద వస్తుండడంతో శుక్రవారం నీటిమట్టం 404.90 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరి లోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

వచ్చే నెల 6న కేటీఆర్ జిల్లా పర్యటన

ఇల్లెందు: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే నెల జిల్లాలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ వెల్లడించారు. ఇల్లెందులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే 6వ తేదీన కొత్తగూడెం, భద్రాచలంలో కేటీఆర్ పర్యటిస్తారని తెలిపారు. ఆయన పర్యటన విజయవంతానికి ఈ నెల 24న కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లను అందిస్తున్న సీఐ సతీశ్‌కుమార్

పాల్వంచ: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు తిరిగి ఫోన్లను అందించారు. సీఐ సతీశ్‌కుమార్ కథనం ప్రకారం.. ఇటీవల కొందరు తమ సెల్‌ఫోన్లు పోయాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా రికవరీ చేసి 14 సెల్ ఫోన్‌లను బాధితులకు తిరిగి శుక్రవారం అందించామని సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి వచ్చిన భారీ కొండచిలువ



గౌతంపూర్‌లో పట్టుకున్న కొండచిలువ

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం గౌతంపూర్ కాలనీకి చెందిన రాజు ఇంట్లో శుక్రవారం 11 అడుగుల కొండచిలువను గుర్తించారు. ఆయన ఇంట్లోని కోడిపుంజును మింగినట్లు గుర్తించి ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ బృందానికి సమాచారం ఇచ్చారు. దీంతో బృందం సభ్యులు సంతోష్, మహేశ్, దత్తు చేరుకుని చాకచక్యంగా కొండచిలువను బంధించి అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కొండచిలువలు మనుషులకు హానీ చేయవని తెలిపారు. ఈ జాతి అంతరించిపోతున్న నేపథ్యాన ఎక్కడైనా కనిపిస్తే చంపకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మఠం కూల్చే నిర్ణయాన్ని విరమించుకోవాలి



మాట్లాడుతున్న గణేశ్‌మహరాజ్

పాల్వంచ: ఏపీ ప్రభుత్వం హథిరాం బాలాజీ మఠాన్ని కూల్చివేయాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని గిరిజన సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌మహరాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాన్ని బంజార సామంతులు, గురువులు, భక్తులు, మేధావులు ఏకమై తిప్పికొట్టాలన్నారు. రానున్న రోజుల్లో బంజరాల ఆరాధ్య దైవం అయిన హథీరాం బంజరా మఠం జోలికి వస్తే భారీ ఎత్తున ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కిశోరి బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుగులోతు గణేశ్‌స్వామిని నియమించాని చెప్పారు. కార్యక్రమంలో నక్రుసాధు, గురుప్రసాద్, సీతారాం, రాందాస్, సంపత్, రాంఫల్, దేస్యా, లచ్చు, ఈరు, రవి, నీలాబాయి, కేశిబాయి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

సరిపడా వైద్యులు లేక..

- ఎంసీహెచ్‌లో గర్భిణుల, బాలింతల అవస్థలు
- టెక్నీషియన్లు లేక ఎక్స్‌రే, ఓటీలోనూ ఇబ్బందులు
- బయట నుంచి పెరుగుతున్న రిఫరల్ కేసులతో భారం
- వైద్యులు, టెక్నీషియన్ల సంఖ్య పెరిగితేనే ఫలితం



రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం

కొత్తగూడెంఅర్బన్: బాలింతలు, శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా ఏర్పడిన ఎంసీహెచ్(మతా, శిశు ఆరోగ్య కేంద్రం)లో వైద్యులు, టెక్నీషియన్ల కొరతతో ఆశించిన స్థాయిలో పేద, మధ్య తరగతి ప్రజలకు సేవలు అందడం లేదు. కొత్తగూడెం పరిధి రామవరంలో ఎంసీహెచ్ ప్రారంభమైన రోజుల్లో జిల్లా నలుమూలల నుంచి గర్భిణులు వచ్చి ప్రసవాలు చేయించుకునే వారు. గత ఏడాది వరకు అంతా బాగానే ఉన్నా ప్రస్తుతం ఎంసీహెచ్‌లో వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఉన్న కొందరు వైద్యులపై భారం పడుతోంది.

ఇతర ఆస్పత్రులకు రిఫర్

ఎంసీహెచ్‌కు జిల్లా నలుమూలల నుంచి గర్భిణులు వస్తుంటారు. వైద్యులు సరిపడా లేక కొంచెం రిస్క్ ఉన్న కేసులను ఇతర జిల్లాలకు రిఫర్ చేస్తుండటంతో పలువురు 108లోనే ప్రసవిస్తున్నారు. ఇంకొందరు సదరు ఆస్పత్రికి చేరుకునేలోగానే ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ ఉన్నా వైద్యుల కొరత అనేది విమర్శలకు తావిస్తోంది. కాగా, మాతా, శిశు ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు గర్భధారణ సమయంలో పరీక్షలు, ఆరోగ్య సలహాలతో పాటుగా సాధారణ డెలివరీ చేయాలి. పుట్టిన శిశువుల ఆరోగ్య సంరక్షణ, పరీక్షలు, టీకాలు వేయాలి. తల్లి, శిశువులో పోషకాహార లోపాలు నివారించడానికి ఐరన్, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం అందించాలి. డెలివరీ అనంతరం తల్లి, శిశువు ఆరోగ్యంపై పర్యవేక్షణ, తల్లిదండ్రులకు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి. మాతా, శిశు మరణాల లేకుండా చూడటమే లక్ష్యంగా ఎంసీహెచ్ వైద్యులు, సిబ్బంది పనిచేయాలి. కానీ, సాయంత్రం నాలుగు గంటల తరువాత ఆస్పత్రికి వచ్చే పిల్లలకు కూడా సేవలందడం లేదని పలువురు చెబుతున్నారు.

తగ్గుతున్న ప్రసవాలు

ఎంసీహెచ్‌లో గైనకాలజీ వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు మొత్తం 18 మంది ఉండాల్సి ఉంది. కానీ, అంతా కలిపి 8 మంది పని చేస్తుండగా, వీరిలో ముగ్గురు ప్రొఫెసర్లు ఉండగా ఐదుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. పిల్లల వైద్యులు 13 మందికిగాను ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇద్దరు పని చేస్తున్నారు. రేడియాలజిస్టులు 10 మందికిగాను ఇద్దరే ఉన్నారు. దీంతో ప్రస్తుతం ఆస్పత్రిలో డెలివరీలు కేవలం పది మాత్రమే జరుగుతున్నాయి. గతంలో 50వరకు జరిగేవి. ఓపీకి గర్భిణులు 120మంది వస్తుండగా, పిల్లలు 150మంది వరకు వస్తున్నారు. ఆస్పత్రిలో పేషెంట్ కేర్ సిబ్బంది కూడా అరకొరగా ఉండడంతో గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో టెక్నీషియన్లు లేకపోవడంతో వెంటిలేటర్లను వినియోగించడం లేదు. వీటితో పాటుగా ఎక్స్‌రే టెక్నీషియన్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు కూడా లేకపోవడంతో ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆస్పత్రిలో పని చేస్తే వైద్యులు, సిబ్బంది అవస్థ పడుతున్నారు. అత్యవసర సమయంలో ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోతున్నారు. ఇది ఇలానే కొనసాగితే ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజల్లో నమ్మకం పోయే పరిస్థితి ఉంటుందని, జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని ఆస్పత్రికి వచ్చిన వారు వారి అభిప్రాయపడుతున్నారు.

నోటిఫికేషన్లు ఇచ్చినా ఫలితం లేదు..

కొత్తగూడెం రామవరం ఎంసీహెచ్‌లో గైనకాలజీ, పిల్లల వైద్యులు తక్కువగా ఉన్నారు. సరిపడా వైద్యుల నియామకం కోసం ఎన్నిసార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా అర్హత కలిగిన వారు ఎవరూ రావడం లేదు. దీంతో ప్రస్తుతం ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులపై అధికభారం పడుతున్న విషయం నిజమే. గత జూన్ లో కూడా నోటిఫికేషన్ ఇచ్చినా కూడా ఎవరూ రాలేదు. – రాధామోహన్, కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్

ఇండోర్‌లో కేఎంసీ బృందం పర్యటన

వ్యర్థాల నిర్వహణ, అభివృద్ధి, పౌర సేవలపై పరిశీలన



వాహనాల ట్రాకింగ్ వివరాలు వెల్లడిస్తున్న ఇండోర్ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన కార్పొరేటర్లు, అధికారుల బృందం ఇండోర్‌లో తమ పర్యటన కొనసాగించారు. ఇండోర్‌లో గురువారం మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా ఆధ్వర్యాన పర్యటించగా.. అక్కడ ఇంటింటా చెత్త సేకరణ, చెత్త వాహనాల ట్రాకింగ్, వ్యర్థాల రీసైక్లింగ్‌పై ఆరాతీశారు. స్వచ్ఛతలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఇండోర్‌లో చెత్త సేకరణకు అవలంభిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాలను సేకరించే వాహనంలో ఆరు బ్లాక్‌లు ఉండగా.. మూడు బ్లాక్‌ల్లో ఎలక్ట్రికల్, మెడికల్ వ్యర్థాలు, శానిటరీ ప్యాడ్లు సేకరిస్తామని, మరో మూడింట్లో తడి, పొడి వేరుగా చేసి సేకరించడం, ఇతర వ్యర్థాలను తీసుకుంటున్నట్లు అక్కడి అధికారులు వివరించారు. అలాగే, వ్యర్థాలన్నింటినీ రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తామని, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, బయోగ్యాస్ తయారీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మూడు, నాలుగు డివిజన్లను జోనల్‌గా ఏర్పాటు చేసి 30 – 40 వాహనాల చెత్త సేకరిస్తూ డివిజన్‌కు 30 మంది కార్మికులను నియమించినట్లు వెల్లడించారు. చెత్త సేకరణ బాధ్యతను ఎన్జీవోలకు అప్పగించడంతో ప్రతీ ఇంట పక్కాగా చెత్త సేకరణ జరుగుతోందని, వాహనాలను ట్రాకింగ్ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఇండోర్ అధికారులు తెలిపారు. అలాగే, చెరువులు, కాల్వల ఆధునికీకరణ, రోడ్ల విస్తరణ పనులను కూడా మేయర్ బృందం పరిశీలించింది. అనంతరం ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ్‌తో భేటీ అయిన ఖమ్మం బృందం పలు అంశాలపై చర్చించారు. ఆదాయ వనరులు, వ్యయాలు, పాలన, పౌర సేవల వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని అనుకూలతలు ఉన్నాయని తెలిపారు. ఇండోర్ స్టడీ టూర్‌లో పరిశీలించిన అంశాలను ఇక్కడ అమలుకు అధికారులతో చర్చిస్తామని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

నేలకొండపల్లి/కూసుమంచి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ కమిషనర్ కె.కృష్ణ సూచించారు. నేలకొండపల్లి మండలం మోటాపురం, కూసుమంచి మండలం ఈశ్వరమాధారం, భగవత్‌వీడు గ్రామాల్లో పనుల జాతరలో భాగంగా శుక్రవారం పర్యటించిన ఆయన ఉపాధి నిధులతో చేపట్టే పనులను ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ పల్లెలో రహదారులు నిర్మిస్తుండగా నాణ్యతపై ఉద్యోగులు దృష్టి సారించాలని సూచించారు. విధుల్లో ఎవ రు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమాల్లో డీఆర్‌డీఓ ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీఓలు ఎం.యర్రయ్య, రాంచందర్ రావు, ఎంపీఓ శివ, ఏపీఓలు ఆర్.సునీత, అప్పారావు, ఈసీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

దమ్మపేట: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో వచ్చే నెల 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ కోరారు. మండలంలోని నాగుపల్లి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పీఆర్‌టీయూ పోరాడుతోందని తెలిపారు. సీపీఎస్ రద్దుతో పాటు పెండింగ్ బిల్లుల మంజూరు, డీఏ, పీఆర్‌సీ విడుదల ఇతర సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పుల్లం దామోదర్ రెడ్డి, జిల్లా, మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.నరసయ్య, ప్రభాకర్, పీఎస్ఎస్.ప్రసాద్, ఎ.వెంకటేశ్వర్లు, నాయకులు బండి శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బజ్జూరి సరళ, జనార్దన్, మస్తాన్‌అలీ, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే నిర్వహించాలి..

అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ సైదులు

బూర్గంపాడు: గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరపీడితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి సైదులు వైద్యసిబ్బందిని ఆదేశించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీని, బూర్గంపాడు సీహెచ్‌సీని, నాగినేనిప్రోలు హెల్త్ సబ్‌సెంటర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని పేర్కొన్నారు. జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వైద్యసిబ్బంది, వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, హెల్త్ ఆఫీసర్, లింగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆర్థిక బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చిరు, వీధి వ్యాపారులను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కమిషనర్ బి.నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్ సభ్యులు, చిరు వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను చైతన్య పరిచి ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వీధి వ్యాపారులను గుర్తించి వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి ఒకొక్క సభ్యుడికి రూ.10వేల రూపాయాలను అందించి వ్యాపారం నిర్వహించుకునేందుకు ప్రోత్సహిస్తామన్నారు. అదే విధంగా మున్సిపాలిటీను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచడంలో సమిష్టిగా కృషి చే ద్దామని కోరారు. కోతులు, కుక్కల సమస్యను నివారించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ పింగళి నాగరాజు రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి



మాట్లాడుతున్న జీఎం రామచందర్

మణుగూరు టౌన్: ఏరియాలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ నాణ్యతతో కూడిన బొగ్గును ఉత్పత్తి చేసేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టినట్లు మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంస్థ లక్ష్యాలను ఏరియా ప్రగతిని వివరించారు. ప్రస్తుత కంపెనీ ముందున్న సవాళ్లను, వాటిని అధిగమించేందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో పాటు సంస్థలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు లక్ష్మిపతిగౌడ్, శ్రీనివాసచారి, రమేశ్, శ్రీనివాస్, అనురాధ, బాబుల్ రాజు తదితరులు ఉన్నారు.

ఉత్తమ పరిశోధనకు రివార్డులు



ప్రశంసాపత్రాలు అందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందంతో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: కేసుల పరిశోధనలో ప్రతిభ కనబర్చిన పోలీసు ఉద్యోగులకు ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. క్లూస్ టీం, టాస్క్‌ఫోర్స్ బృందాలకు చెందిన సీఐలు అశోక్‌కుమార్, రమాకాంత్, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, రామారావుతో పాటు సిబ్బంది కె.భీష్మారావు, శోభన్‌బాబు, కరీముద్దీన్, రాజు, జంషీద్, సాయికిరణ్, రవి, విజయ్, రామకృష్ణ, వెంకటనారాయణ, రాంకోటి, బాసిత్ రివార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.



క్లూస్ టీం బృందంతో ఎస్పీ

హెచ్‌ఎంలుగా అక్కాచెల్లెళ్లు!

ఒకేసారి ఇద్దరికి పదోన్నతి



దుర్గాభవాని



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉషారాణి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఉపాధ్యాయుల (ఎస్ఏ)కు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నుంచి అక్కాచెల్లెళ్లకు ఒకేసారి పదోన్నతి రావడం విశేషం. అయితే, వీరిద్దరూ ఒకేసారి ఉపాధ్యాయులుగా విధుల్లో చేరడం, ఆపై ఎస్ఏలుగా పదోన్నతి పొందగా ఇప్పుడు ఒకేరోజు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి పొందడంపై పలువురు అభినందించారు. అక్క చావా ఉషారాణి, చెల్లె చావా దుర్గాభవాని 1993 జూన్ 14న ఎస్‌జీటీలుగా ఖమ్మం అర్బన్ యూపీఎస్, ఖమ్మం జీహెచ్ఎస్ మోమినాన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆతర్వాత స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొంది ప్రస్తుతం కూసుమంచి మండలం నేలపట్ల, చింతకాని మండలం నేరడ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిద్దరు శుక్రవారం గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందగా, దుర్గాభవాని ఎన్నెస్పీ కాలనీ పాఠశాలలో, నయాబజార్ పాఠశాలలో ఉషారాణిలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయులు, ఉద్యోగులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని జగదీశ్‌కాలనీకి చెందిన మణికంఠ శుక్రవారం ఆత్మహత్య చేసున్నాడు. కాగా ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరివేసుకొని యువకుడు ..



సుధీర్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: వేధింపు లు తాళలేక ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డా డు. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బంగారుచెలక గ్రామపంచాయతీ పరిధి పాత బంగారు చెలక గ్రామానికి చెందిన కోడిరెక్కల సుధీర్ (24)ను వివాహేతర సంబంధం విషయమైన అదే గ్రామానికి చెందిన కొందరు వేధింపులకు ప్పాలడుతున్నారు. మనస్తాపం చెందిన సుధీర్ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. నోట్ ఆధారంగా లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన ఇంట్లోని వస్తువులు

పాల్వంచరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమైన ఘటన పునుకుల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పునుకుల గ్రామంలోని వల్లపు శ్యామెయిల్ ఇంట్లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చేలరేగాయి. టీవీ, దుస్తులు, వంటసామగ్రి, రూ.45వేల నగదు, ఫ్యాన్లు, వంట సరుకులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కొత్తగూడెం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూరల్ ఆర్ఐ అనిల్‌కుమార్ అగ్నిప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

బోల్తా పడిన బస్సు



బోల్తా పడిన మినీ బస్సు



ప్రమాదస్థలంలో ప్రయాణికులు

దమ్మపేట: అదుపుతప్పిన మినీ బస్సు రోడ్డు పక్కన పొదల్లో బోల్తా పడిన ఘటన మండలంలోని గట్టుగూడెం శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఏపీలోని వైజాగ్ నుంచి హన్మకొండకు ఓ శుభాకార్యానికి మినీ ప్రైవేట్ బస్సులో 20మంది వెళ్తున్నారు. ఆ బస్సు గట్టుగూడెం శివారుకు చేరుకోగా ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన పొదల్లో బోల్తాపడింది. కాగా బస్సులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి, ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా



రహదారిపై పడిన ట్రాక్టర్, జీడి మామిడి కలప

అశ్వారావుపేటరూరల్: జీడి మామిడి కలపతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి ప్రధాన రహదారిపై బోల్తా పడిన ఘటన శుక్రవారం అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. మండలంలోని ఊట్లపల్లి వైపు నుంచి ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి వెళ్తున్న ట్రాక్టర్ స్థానిక సంత మార్కెట్ సమీపంలో రహదారిపై గుంతల కారణంగా అదుపుతప్పి పడిపోయింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న జీడి మామిడి కలప రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆ తర్వాత కలపను మరో ట్రాక్టర్లో లోడు చేసి తరలించారు.

ఏడుగురు గిరిజన మహిళల అరెస్ట్



అరెస్టయిన మహిళలు

చర్ల: మండలంలోని మామిడిగూడెం సమీపంలోని అటవీభూముల్లో అధికారులు నాటిన వెదురుమొక్కలను ధ్వంసం చేసిన ఘటనలో ఏడుగురు గిరిజన మహిళలను అరెస్టుచేశారు. దుమ్ముగూడెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కమల కథనం ప్రకారం.. పెదమిడిసిలేరు రిజర్వ్ ఫారెస్ట్‌లో దేవరాపల్లి బీట్‌లోని మామిడిగూడెం క్యాంప్ నంబర్ 65 (సీ)లో జూలై నుంచి హరితవనాల పెంపకంలో భాగంగా 50 హెక్టార్లలో సుమారు రూ.10లక్షలు వెచ్చించి వెదురు, టేకు మొక్కలు నాటారు. అయితే వీటితో పాటు మరికొంత విస్తీర్ణంలో నాటేందుకు కూడా సుమారు 3 వేల మొక్కలను ఆ ప్రాంతానికి తరలించారు. కాగా, మామిడిగూడెనకు చెందిన కొందరు మహిళలు ఈ మొక్కలను ధ్వంసం చేశారు. వీరిపై కేసు నమోదు చేసిన అటవీశాఖాధికారులు ఏడుగురు మహిళలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.